# సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023




## నైపుణ్య ప్రాప్తిరస్తు

అక్కడి పిల్లలు చదువుతో పాటు పని కూడా నేర్చుకుంటున్నారు. ఆ నైపుణ్యం ఉపాధికి పనికొస్తోంది. - 8లో




## రోడ్డు ప్రమాదంలో ఈఓ మృతి

రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి ఈఓ మృతిచెందారు. బైక్ డివైడర్‌ను ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. - 8లో

## ఆశ్రమ పాఠశాల వార్డెన్ సస్పెన్షన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వార్డెన్ హరిప్రసాద్‌ను గిరిజన సంక్షేమాధికారి సస్పెండ్ చేశారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావుకి షోకాజ్ నోటీసు జారీ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులను నిర్లక్ష్యంగా విడిచిపెట్టడం, 8వ తరగతి విద్యార్థి ఆరిక రాకేష్ ప్రమాదం బారిన పడి మృతి చెందడం, మరో ఇద్దరు విద్యార్థులు బడిలో లేకుండా బయటకు వెళ్లడంతో వార్డెన్, ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు.

## న్యూస్‌రీల్

### జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు రాధిక శ్రీ



తూముల రాధిక శ్రీ

టెక్కలి: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తూముల రాధిక శ్రీ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలకు ఎంపికైంది. ఇటీవల కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలో నిలవడంలో రాధిక శ్రీ కీలకపాత్ర పోషించడంతో ఈ పోటీలకు ఎంపిక చేశారు. మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడం గోల్డెన్ రూల్ పాఠశాలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. విద్యార్థిని ఎంపికపై ప్రిన్సిపాల్ దామోదరరావు, పీఈటీ హేమలత, పాఠశాల ఉపాధ్యాయినిలు, తల్లిదండ్రులు మహేశ్వరరావు, సుశీల అభినందించారు.

### పొరుగు రాష్ట్రాలకు ఉద్దానం పనస



ఇతర ప్రాంతాలకు ఆటోల్లో తరలిస్తున్న పనస పిందెలు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్దానం పనస పొరుగు రాష్ట్రాలకు పయనమవుతోంది. ప్రస్తుతం పనస పిందె స్థాయిలో ఉండటంతో కూరలకు అనుకూలంగా ఉంటుంది. దీంతో వ్యాపారులు రైతులను ఆశ్రయిస్తూ కొనుగోలు చేస్తున్నారు. నేరుగా వ్యాపారులు రైతుల వద్దకు వెళ్లి కేజీ పనస కాయ ధర రూ. 20లకు కొనుగోలు చేస్తూ, రెండు, మూడు రూపాయలకు అదనంగా బరంపురం, కటక్, ఖుర్దా, గుజరాత్, కోల్‌కత్తా, ముంబై వంటి ప్రదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

### నేడు జిల్లా అండర్-19 హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్–19 బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు మంగళవారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్ తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ జరగనున్నట్టు చెప్పారు. ఈ 2003 జనవరి ఒకటి తర్వాత జన్మించిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్టును కర్నూలు జిల్లా వేదికగా మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే 7వ ఏపీ జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్–2022–23 పోటీలకు పంపించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా జట్టు ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ (ఎస్ఎస్‌సీ)పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు. వివరాలకు సంఘ కార్యనిర్వాహణ కార్యదర్శి, పీడీ డి.ఈశ్వరరావు (94937 64447)ను సంప్రదించాలన్నారు.

### చిరుధాన్యాలే మేలు: కలెక్టర్



రాగిజావను అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. చిరుధాన్యాల ఆహార పండుగ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరం వద్ద స్పందనలో చిరుధాన్యాల ఆహార ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ స్పందన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తుదారులకు, జిల్లా అధికారులకు చిరుధాన్యాలతో తయారు చేసిన రాగి జావ అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో చిరుధాన్యాల ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు.

# ఆధునిక రాతి యుగం

మానవ నాగరికత పాత రాతియుగం నుంచి మొదలైందని చరిత్ర చెబుతోంది. అంటే.. కొన్ని లక్షల సంవత్సరాల నుంచే రాయితో మన మనుగడ సాగుతోందన్న మాట. రాళ్లతోనే నిప్పు రాజేయడం, రాతి ఆయుధాలు, రాళ్లతో చేసిన గృహోపకరణాలు మానవ జీవనంలో భాగంగా ఉండేవి. శ్రమైక జీవన సౌందర్యం వెల్లివిరిసేది. రాతి గృహోపకరణాల వినియోగం ద్వారా శరీరానికి మన ప్రమేయం లేకుండానే వ్యాయామం లభించేది. ఆహార పదార్థాలకు అద్భుత రుచి సమకూరేది. ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమయ్యేది. కానీ కాలం మారింది. బిజీ జీవనంతో పాటు మనిషి సుఖమెరిగాడు. రాతి గృహోపకరణాల స్థానంలో యంత్రాలు రంగప్రవేశం చేశాయి. ఫలితంగా శరీరానికి వ్యాయామం తగ్గింది. దాని కోసం మళ్లీ జిమ్‌లను, ఏరోబిక్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే ఇటీవలి కాలంలో మళ్లీ రాతి గృహోపకరణాలు మన జీవితంలోకి వస్తున్నాయి. కొంత ఆధునికతను అద్దుకుని వస్తున్న ఇవి ప్రజాదరణ చూరగొంటున్నాయి. వీటి అమ్మకాలు, వినియోగం కూడా పెరుగుతున్నాయి.



పాలఖండ్యాంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న రాతి గృహోపకరణాలు

- రాతి గృహోపకరణాలకు మళ్లీ ఆదరణ
- స్టీల్ హ్యాండిల్స్ తో సులువుగా వాడుకునేలా
- శరీరానికి వ్యాయామం.. జిహ్వకు రుచి
- స్థానికంగా తయారీతో పాటు చెన్నై నుంచి దిగుమతి



సన్నికల్లు చెక్కుతూ..

శ్రీకాకుళం డెస్క్:

నేటి తరానికి ఆ పేర్లు పలకాలంటేనే ఇబ్బంది. ఇంట్లో ఏదో మూలన ఉన్నా వాటి పనితీరు తెలుసుకోవాలంటేనే అనాసక్తి. శిల్పి శిలను చెక్కి శిల్పంగా మార్చినట్లు.. బండరాయిని తీసుకుని మన అవసరాలకు అనుగుణంగా గృహోపకరణాలు రూపొందించారు పూర్వీకులు. వాటిని వినియోగించి అటు ఆరోగ్యంగా.. ఇటు శారీరకంగా శ్రమించి జీవితకాలాన్ని గడిపారు. ఇంతకీ ఏమిటవీ అనేదేగా మీ ప్రశ్న. అవేనండీ ఇంట్లో మూలకు చేరిన తిరగలి.. రుబ్బురోలు.. గొడ్డ.. సన్నిరాయి తదితరాలు. మళ్లీ వీటి వినియోగం ఇటీవల కాలంలో పెరుగుతోంది. సులువుగా వినియోగించేందుకు స్టీల్ హ్యాండిల్స్‌ను అమర్చి ఈ గృహోపకరణాలను 'చెక్కు'తున్నారు.

**పాలఖండ్యాంలో 30.. పాకివలసలో 20..**

శ్రీకాకుళం నుంచి రాజాం వెళ్లే మార్గంలో పాలఖండ్యాం వద్ద రోడ్డు పక్కన ఈ సంప్రదాయ రాతి గృహోపకరణాలు మనకు దర్శనమిస్తాయి. 8దుకాణాల్లో వివిధ రకాల సైజుల్లో తిరగళ్లు.. రుబ్బు రోళ్లు.. సన్నిగొడ్డలు.. ఇక్కడ విక్రయిస్తున్నారు. 30 ముస్లిం కుటుంబాలు వీటి తయారీపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. రోజూ పరిసర గ్రామాలకు ఆటోలపై సరుకును తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు తయారీదారులు. కొన్నింటిని చెన్నై నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే కోటబొమ్మాళి మండలం పాకివలసలో 20 ముస్లిం కుటుంబాలు వీటి తయారీపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.



**నిమ్మాడ నుంచి రాయి..**

వీటి తయారీకి నల్లజనపరాయిని వినియోగిస్తున్నారు. ఈ రాయి కోసం టెక్కలి సమీపంలో ఉన్న నిమ్మాడ పరిశ్రమల నుంచి రాయిని సేకరిస్తున్నారు. క్రషింగ్‌లో పగిలిపోయిన బండలను అడుగుల లెక్కన కొనుగోలు చేస్తున్నట్లు తయారీదారుడు సయ్యద్ రంజాన్ తెలిపారు.

**ధరలు ఇలా..**

రాతి గృహోపకరణాల ధరలు సైజును బట్టి రూ.500 నుంచి రూ.800 వరకు ఉన్నాయి.

**చక్కటి వ్యాయామం..**



తిరగలి వినియోగం వలన నడుం, వీపు, చేతి కండరాలు, పొట్టముందు భాగం ఛాతీ కండరాలకు చక్కటి వ్యాయామం. వెన్నుపూస ఫ్లెక్సిబులిటీ పెరుగుతుంది. ఇది ఏరోబిక్ ఎక్సర్‌సైజ్. రోలును నిలబడి వినియోగించడం వల్ల చేయి, భుజంతో పాటు ఛాతీ భాగానికి మంచి వ్యాయామం. ఇది మోడరేట్ ఇంటెన్సిటీ ఏరోబిక్ ఎక్సర్ సైజ్. వీటిని దినచర్యలో భాగంగా చేసుకుంటే సర్వైకల్ స్పాండిలైటిస్, లంబా స్పాండిలైటిస్ రాకుండా నిరోధించవచ్చు. కండరాల బలహీనతల వల్ల వచ్చే వ్యాధులు నిరోధించవచ్చు.

– డాక్టర్ బగాది రఘు, ఎంపీటీ ఇన్ ఆర్థోపెడిక్స్

**అమ్మకాలు పెరిగాయి..**



నల్లజనపరాయితో వీటిని చాలా ఏళ్లుగా తయారు చేస్తున్నాం. ఇటీవలి కాలంలో వీటి అమ్మకాలు బాగా పెరిగాయి. చిన్న చిన్న రోళ్లను పెళ్లిళ్లకు గిఫ్ట్ ఆర్టికల్స్‌గా ఇచ్చే సంస్కృతి పెరిగింది. కొన్నింటిని మేము తయారు చేస్తున్నాం. మరికొన్ని చెన్నై నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. –సయ్యద్ రంజాన్, తయారీ దారు, పాలఖండ్యాం

**ఆ రుచే వేరు..**



వీటిని ఉపయోగించి చేసే పచ్చళ్లు, ఇతర వంటకాలు భలే రుచిగా ఉంటాయి. నేను చిన్ననాటి నుంచి వీటినే వినియోగిస్తున్నాను. కరెంట్ షాక్‌లు ఇతర ఇబ్బందులుండవు. చక్కగా శుభ్రం చేసుకోవచ్చు. శారీరక వ్యాయామం కూడా.

–కుప్పబోడెమ్మ, పాలఖండ్యాం

**ప్రయోజనాలెన్నో..**



శారీరక శక్తిని వినియోగిస్తే విద్యుత్ శక్తిని ఆదా చేయవచ్చు. తద్వారా పర్యావరణానికి మేలు.

- ఎలక్ట్రిక్ సాధనాలైన మిక్సీ, గ్రైండర్‌లను వినియోగించి చేసే వంటలకంటే వీటిని ఉపయోగించడం వల్ల రుచిలో చాలా తేడా ఉంటుంది.
- తయారు చేసిన ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యం ఎక్కువ.
- పోషకాలు అలాగే ఉంటాయి.
- చక్కగా శుభ్రం చేసుకునే సదుపాయం ఈ రాతి వస్తువుల సొంతం.



**వినియోగిస్తే మంచిది..**



ఉరుకుల పరుగుల జీవనంలో మహిళకు శారీరక శ్రమ తగ్గింది. ఒబెసిటీ పెరిగిపోతోంది. ప్రతి పనికీ ఓ మెషీన్ వచ్చి చేరింది. సంప్రదాయ గృహోపకరణాల వినియోగం తగ్గింది. ముఖ్యంగా గర్భిణులు రాతి పరికరాలను వినియోగిస్తే మంచి వ్యాయామం. ఏడోనెల వరకు ఇలాంటి పరికరాలతో పనులు చేసుకోవచ్చు. శారీరక శ్రమతో ప్రసవం సులువవుతుంది.

–డాక్టర్ జి.జ్ఞాన ప్రసూన, గైనికాలజిస్ట్, జిల్లా ఆస్పత్రి టెక్కలి

## కలెక్టర్ స్పందన @ 173



స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయనతో పాటు ఐటీడీఏ పీఓ, ఇన్‌చార్జి జేసీ బి.నవ్యలు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ స్పందనలో 173 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం పాతబస్టాండ్

## ఎస్పీ స్పందన @ 46



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ స్పందన కార్యక్రమానికి 46 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ రాధిక పేర్కొన్నారు. ఇందులో పౌర సంబంధమైనవి 8, మోసపూరితమైనవి 2, కుటుంబ తగాదాలు 5, భౌతిక దాడులకు సంబంధించి 4, పాతవి 3, మిస్సింగ్ 1, ఆస్తి తగాదాలు 7, ఇతరత్రా 16 ఉన్నాయి.

–శ్రీకాకుళం క్రైమ్

## ఎమ్మెల్సీ బరిలో ఇద్దరు

శ్రీకాకుళం స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల బరిలో ఇద్దరు అభ్యర్థులు ఉన్నట్టు జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారి బి.నవ్య తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ సోమవారం మధ్యాహ్నం 3 గంటలతో ముగిసిందని, ఆ సమయానికి ఎవ్వరూ నామినేషన్లు ఉపసంహరించుకోలేదని, దీంతో బరిలో ఇద్దరు నిలిచారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నర్తు రామారావు, స్వతంత్ర్య అభ్యర్థిగా ఆనెపు రామకృష్ణలు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు మార్చి 13వ తేదీన జరగనున్నాయి. ఓటర్లుగా ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పురపాలక సంఘాల వార్డుల కౌన్సిలర్లు ఉంటారు. జిల్లాలో 776 మంది ఓటర్లు ఉన్నారు. వీరు స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుడిని ఎన్నుకుంటారు.

–శ్రీకాకుళం పాతబస్టాండ్

## 1 నుంచి న్యాయవిద్య 3, 7 సెమిస్టర్ పరీక్షలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ కళాశాలల పరిధిలో ఎల్‌ఎల్‌బీ, మూడు, ఐదేళ్ల డిగ్రీకి సంబంధించి 3, 7 సెమిస్టర్ పరీక్షలు వర్సిటీ కేంద్రంగా మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య చెప్పారు. పరిపాలన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలు మార్చి 14 వరకు జరుగుతాయని చెప్పారు. పోస్టు గ్రాడ్యుయేషన్ 1, 3 సెమిస్టర్ పరీక్షలు మార్చి 20వ తేదీ నుంచి 30 వరకు వర్సిటీ పరీక్ష కేంద్రంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

–ఎచ్చెర్ల క్యాంపస్

# చిన్న అప్రమత్తత.. పెద్ద ఘనత



బాలకృష్ణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- హత్య కేసును ఛేదించిన ఫొటో
- దాన్ని తీసిన వ్యక్తి క్రైమ్ కానిస్టేబుల్
- దాంతోనే అనుమానాస్పద మృతి.. హత్యగా నిర్ధారణ
- ఆ వెంటనే నిందితుల గుర్తింపు

రణస్థలం: వరిసాం నుంచి చిల్లపేట లే అవుట్ల వైపు వెళ్లే దారిలో మర్రి చెట్టు కింద సోమవారం ఉదయం జీరు బాలకృష్ణ(35) అనే వ్యక్తి మృతదేహం కనిపించింది. చూస్తే ఒంటిపై రక్తపు చుక్క లేదు. పెద్దగా దెబ్బల ఆనవాళ్లు కూడా లేవు. పొరపాటున కిందపడి గుండె ఆగి చనిపోయినట్టుగానే అందరికీ అనిపించింది. క్లూస్‌టీమ్ వారు కూడా ముందు ఇలాగే అనుకున్నారు. కానీ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టాక దిమ్మ దిరిగే విషయాలు తెలిశాయి. బాలకృష్ణ మరణంలో భార్య సునీతే ప్రధాన సూత్రధారి అని తెలిసింది.ప్రియుడు, అతడి స్నేహితుల సాయంతో ఎవరికీ తెలియకుండా మట్టుబెట్టినట్లు రుజువైంది. క్రైమ్ కానిస్టేబుల్ తీసిన ఫొటో ఈ హత్య ఉదంతాన్ని బయటపెట్టింది. పోలీసులు, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పూర్తి వివరాల్లోకి వెళితే..

పైడిభీమవరం పంచాయతీలో గల వరిసాం గ్రామంలో జీరు బాలకృష్ణ(35) పాతికేళ్లుగా నివాసం ఉంటున్నారు. స్వగ్రామం చిల్లపేట రాజాం అయినా ఇక్కడే ఉంటున్నాడు. రణస్థలం మండలంలోని మెంటాడకు చెందిన సునీతతో ఈయనకు కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాలకృష్ణ రోజు కూలీగా పనిచేస్తుంటారు. సోమ వారం ఉదయం వరిసాం పొలాల్లో మర్రి చెట్టు కింద బాలకృష్ణ మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే జేఆర్ పురం సీఐ ఎస్.ఆదాం, ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. డీఎస్పీ మహేంద్ర మత్తే కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

**నిజం తెలిసిందిలా..**

పోలీసులు విచారణ మొదలుపెట్టాక బాలకృష్ణను హత్య చేశారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతుడు బాలకృష్ణతో పాటు కంబాల వెంకటరమణ, అఖిల్, రాములు ఆదివారం రాత్రి నిర్మాణంలో ఉన్న సచివాలయంలో మద్యం సేవించడం చూశామని కొందరు పోలీసులకు చెప్పారు. బాలకృష్ణ తన ఇంటి నుంచే చికెన్ కర్రీ కూడా తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఈ వైపుగా ఇన్వెస్టిగేషన్ చేశారు. ఆదివారం రాత్రి 12 గంటలకు ఈ ముగ్గురే క్రైమ్ కానిస్టేబుల్ లక్ష్మణరావుకు వరిసాం దాబా వద్ద కనిపించారు. ఆయన వీరి ఫొటో కూడా తీశారు. కానీ అప్పటికి హత్య సంగతి బయటకు పొక్కకుండా వీరు జాగ్రత్త పడ్డారు. ఈ ఫొటోనే హంతకులు దొరికిపోవడానికి సహాయపడింది. ఈ ఆధారాల సాయంతో పోలీసులు నేరుగా కంబాల వెంకటరమణ ఇంటికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించాక అతను అసలు విషయాలు ఒప్పుకున్నాడు. బాలకృష్ణ భార్య సునీతతో తనకు అక్రమ సంబంధం ఉందని, ఆమే రాత్రి చికెన్ కర్రీ, మందుకు డబ్బులు ఇచ్చి భర్తను తమ వద్దకు పంపించిందని చెప్పాడు. తనకు పైడిభీమవరానికి చెందిన కె.దుర్గాప్రసాద్, వరిసాంకు చెందిన రాము సహకరించారని ఒప్పుకున్నాడు.



బాలకృష్ణ (ఫైల్)

**ఆధారాలు దొరక్కుండా మాస్టర్ ప్లాన్..**

హత్యపై ముందే ప్రణాళిక వేసుకున్న వెంకటరమణ బ్యాచ్.. ఆధారాలు దొరక్కుండా విఫల ప్రయత్నాలు చేశారు. ఆ ప్లాన్ ప్రకారమే బాలకృష్ణ ప్యాంటు జేబులో ఓ మద్యం బాటిల్ పెట్టారు. మద్యం మత్తులో నడవలేక రాయిపై పడిపోయి గుండెకు దెబ్బ తగిలినట్లు, ముఖం కింద మెడ, మోచేయి, కాళ్లు గీరుకుపోయినట్లు చిత్రీకరించారు. అక్కడ నుంచి కొద్ది దూరం నడిచి వచ్చి మర్రి చెట్టు కింద నీళ్లు అందక చనిపోయినట్లు అందరినీ నమ్మించేద్దామని అనుకున్నారు. నిజానికి రాత్రి మద్యం తాగాక బాలకృష్ణ నోరు మూసి మెడ, ఛాతీపై బలంగా గుద్దడంతో అతను ప్రాణాలు వదిలేశాడు. తర్వాత మృతదేహానికి పైన పేర్కొన్నట్లు ఏర్పాట్లు చేసి మర్రిచెట్టు కింద పడేసి వెళ్లిపోయారు. పోలీసులు చాకచక్యంగా విచారణ చేసి నిజాలను వెలికి తీశారు. నిందితులు హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో మృతుడి భార్య సునీతతో పాటు, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై జి.రాజేష్ తెలిపారు.

# అన్నదాతకు అండగా రైతు భరోసా

- నేడు రైతు భరోసా నగదు జమ
- జిల్లావ్యాప్తంగా 3.3లక్షల మందికి రూ 64.75కోట్ల లబ్ధి



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అన్నదాతకు సర్కారు అండగా నిలుస్తోంది. రైతు భరోసా నగదును మంగళవారం అన్నదాతల ఖాతాల్లో జమ చేయనుంది. గతంలో వ్యవసాయ పనులు మొదలయ్యేసరికి రైతుల చేతిలో చిల్లిగవ్వ ఉండేది కాదు. దీంతో అప్పులపాలయ్యేవారు. మరికొంతమంది వ్యవసాయ పనుల కోసం ఇంటిలో మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి సీజన్ అయ్యాక చేతికి పంట డబ్బులు వస్తే విడిపించుకునేవారు. పంట చేతికి రాకపోతే ఆ బంగారాన్ని బ్యాంకుల్లోనే ఉంచేసిన వారు కోకొల్లలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అలాంటి పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండగలా మార్చేందుకు రైతు భరోసా పథకానికి రూపకల్పన చేశారు. దీంతో ఏటా మూడు విడతలుగా రైతు భరోసా సొమ్మును రైతులు అందుకుంటున్నారు. ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీనిలో భాగంగానే మూడో ఏడాది మూడో విడత రైతుభరోసా డబ్బులు వేస్తున్నారు.

**రైతుభరోసాతో ఊరట**

ఏటా ఖరీఫ్ పనుల ప్రారంభానికి ముందు దుక్కి దున్నడానికి, విత్తనాలు కొనుగోలుకి మే నెలలో మొదటి విడత, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకుగాను అక్టోబర్‌లో రెండో విడత, రబీ పంటలకు పెట్టుబడి కోసం మూడో విడత డబ్బులు రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. దీనిలో భాగంగానే ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 3.3లక్షల మందికి గాను పీఎం కిసాన్–రైతు భరోసా డబ్బు రూ.64.75కోట్లు రైతుల ఖాతాల్లో జమ కానుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరులో బటన్ నొక్కి డబ్బులు వేయనున్నారు.

**కొండంత అండ..**

రైతులకు రబీ పంటలకు రైతుభరోసా మూడో విడత డబ్బు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి ఏటా మూడు విడతల్లో డబ్బులు వేస్తున్నాం. రైతులంతా వినియోగించుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి

**ఆసక్తి పెరిగింది..**

గత ప్రభుత్వాల హయాంలో వ్యవసాయం వదిలేసి వలసలు వెళ్లిపోవాలనుకున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుభరోసా ఇచ్చి ఆదుకుంటోంది. వ్యవసాయం చేసేందుకు ఉత్సాహంగా ఉంది.

–జి.చిరంజీవిరావు, రైతు, చిట్టిమండలం

## పకడ్బందీగా ప్రాక్టికల్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా కొనసాగుతున్నాయి. రెండోరోజు సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు కలిపి 10263 మంది హాజరు కావాల్సి ఉండగా 9976 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 287 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లాకు పంపించిన పరిశీలకులు డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి జిల్లాలోని పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా పరిశీలకుడు, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు జిల్లాలోని ఆరు కేంద్రాల్లో తనిఖీలు చేశారు. జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు, డీఈసీ కమిటీ సభ్యులు, హెచ్‌పీసీ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరో 62 కేంద్రాల్లో తనిఖీలు చేపట్టాయి.

## క్లుప్తంగా

### ఆర్టీసీలో నేడు డయల్ యువర్ డీఎం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల పరిధిలోని రూట్లలో ప్రయాణించే వారు ఏ సమస్యలు ఉన్నా వాటిని తమ దృష్టికి తీసుకురావాలని శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటి, రెండు డిపోల మేనేజర్లు కె.మాధవ్, కేఎస్ఆర్ శర్మలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలోని శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస, శ్రీకాకుళం నుంచి కళింగపట్నం, శ్రీకాకుళం నుంచి విశాఖపట్టణం, శ్రీకాకుళం నుంచి పొందూరు, రాజాం మీదుగా బొబ్బిలి వరకూ ప్రయాణించే వారు వారి సమస్యలు, సూచనలు, సలహాలను తన దృష్టికి తీసుకురావాలని ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ కోరారు. అలాగే శ్రీకాకుళం నుంచి హిరమండలం, కొత్తూరు, బత్తిలి, శ్రీకాకుళం నుంచి నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం నుంచి నరసన్నపేట, సారవకోట, పాతపట్నం తదితర రూట్లలో ప్రయాణించే వారు తమ సూచనలను, సలహాలను శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కెఎస్ఆర్ శర్మల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రయాణికులు తమ సమస్యలను, సూచనలను 99592 25608, 99592 25609 నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

### వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు, హజ్ కమిటీ సలహాదారులు అయూబ్‌ఖాన్

ఇచ్ఛాపురం: వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు, హజ్ కమిటీ సలహాదారులు, కృష్ణాజిల్లా ముస్లిం మైనారిటీ సంఘం అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని కస్పావీధిలోని ఫంక్షన్ హాల్‌లో స్థానిక ముస్లింలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తోందని అన్నారు. వక్ఫ్‌బోర్డుకి సంబంధించిన స్థలాలను ఆక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వక్ఫ్‌బోర్డు స్థలాల్లో ముస్లింలకు, నిరుద్యోగులకు జీవనోపాధికి అవకాశం కల్పించాలని స్థానిక పెద్దలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జోహార్‌ఖాన్, అమీర్‌ఆలీ, సయ్యద్‌సుల్తానా, రహిమాన్, ఎంఈసూర్ ముస్లిం పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణా రివర్ క్రాసింగ్ పోరులో సిక్కోలు సత్తా



శ్రీకాకుళం న్యూకాలనీ: కృష్ణా జిల్లాలోని కృష్ణా రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన కొర్ను వెంకటరావు సత్తాచాటారు. ఫిబ్రవరి 26వ తేదీన జరిగిన ఈ పోటీల్లో పొన్నాం గ్రామానికి చెందిన ఈ మాస్టర్ స్విమ్మర్ బంగారు పతకంతో మెరిశారు. ఏపీ సెక్రటేరియట్‌లోని జీఏడీ విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వెంకటరావు మరోసారి ప్రతిష్ఠాత్మక కృష్ణా రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీల్లో పతకంతో రాణించడంపై పలువురు హర్షం వ్యక్తంచేశారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ డిప్యూటీ సీఎం, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఏపీ లైఫ్ సేవింగ్ సొసైటీ ఫౌండర్ లైఫ్ సేవింగ్ నేషనల్ మెడలిస్ట్, స్విమ్మింగ్ కోచ్ షేక్ సుభం(సుభాన్), మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుప్పల వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి నొపడ రాజారావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకట్, తిరుపతిరాజు, మాస్టర్స్ స్విమ్మర్లు సంతోషం వ్యక్తం చేశారు.

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24కే. 10గ్రా.) | 56,150-00 |
| బంగారం(22కే. 10గ్రా.) | 51,800-00 |
| వెండి (కిలో) | 71,200-00 |

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 420.00 |
| విజయనగరం | రూ. 424.00 |
| శ్రీకాకుళం | రూ. 424.00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹95 | ₹160 | ₹ 170 |

# నైపుణ్యా ప్రాప్తిరస్తు!

- శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రొడక్షన్ కం ట్రైనింగ్ సెంటర్
- విద్యార్థుల నైపుణ్యాలను పెంచుతున్న కేంద్రం
- విద్యార్థుల భాగస్వామ్యంతో ఫర్నీచర్ తయారు చేసి విక్రయిస్తున్న వైనం



కార్పెంటర్ పనిలో నిమగ్నమైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: క్లాస్‌రూమ్‌లో ఇరగదీసే స్టూడెంట్లు క్షేత్రస్థాయిలో ఓ పని చేయాలంటే తడబడుతుంటారు. కాలేజీలో చక్కటి మార్కులు సాధించే వారు బయట ఓ కంపెనీలో చదివిన పని చేయడానికి కూడా టెన్షన్ పడిపోతుంటారు. పుస్తకంలో ఉన్న విషయాలకు వాస్తవంలో ఉండే అంశాలకు సారూప్యత తెలియక తికమకపడుతుంటారు. సాంకేతిక, పారిశ్రామిక విద్యలో ఉన్న స్టూడెంట్లకు ఈ తలనొప్పి ఎక్కువగా ఉంటుంది. విద్యార్థులు కాలేజీలో ఉండగానే ఓ వస్తువును ఉత్పత్తి చేసి విక్రయించగలిగితే.. బయట పరిశ్రమల్లో వారు పనిచేయడం సులువవుతుంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇదే అంశంలో ముందడుగు వేసింది. ఇక్కడి ప్రొడక్షన్ కం ట్రైనింగ్ సెంటర్ విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు విషయ పరిజ్ఞానాన్ని కూడా అందిస్తోంది.

**రూ.7.50 కోట్ల విక్రయాలు..**

ఈ సెంటర్‌ను కాలేజీలో 1980లో ప్రారంభించారు. అప్పటి నుంచి కేంద్రం విజయవంతంగా సాగుతోంది. ఇక్కడ ఐరన్, ఉడ్ ఫర్నీచర్ తయారు చేస్తారు. మెకానికల్ డిప్లమా విద్యార్థులకు పని నైపుణ్యం లక్ష్యంగా ఆర్డర్లు తీసుకుని మరీ ఫర్నీచర్ తయారు చేస్తారు. ఈ సెంటర్ నిర్వహణను ఇటీవల పరిశీలించిన రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను పారిశ్రామిక అవసరాలను అనుగుణంగా తీర్చిదిద్దటానికి ఇలాంటి కేంద్రాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కేంద్రంలో విద్యాసంస్థలకు, గ్రంథాలయాలకు, కార్యాలయాలకు అవసరమైన ఫర్నీచర్‌ను ఐరన్, ఉడ్‌తో తయారు చేస్తున్నారు. నాణ్యమైన సామగ్రిని లాభాపేక్ష లేకుండా విక్రయిస్తున్నారు. ఏటా రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల విలువైన ఫర్నీచర్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. కేంద్రం ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు రూ.7.50 కోట్ల విలువైన ఫర్నీచర్‌ను విక్రయించారు.



శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రొడక్షన్ కం ట్రైనింగ్ సెంటర్

**ఉపయోగాలెన్నో..**

ఈ సెంటర్ నిర్వహణ వల్ల విద్యార్థులకు పూర్తిస్థాయి నైపుణ్యాల కల్పన సాధ్యమవుతుంది. చదువు పూర్తయ్యాక ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా, మంచి ఉద్యోగులుగా రూపొందుతారు. ప్రధానంగా వెల్డింగ్, కార్పెంటర్, ప్లంబింగ్, మిషనింగ్, ఫోర్జింగ్, షీట్ మెటల్, ప్యాబ్రికేషన్స్ వంటివి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయి. ఉపాధి కల్పనే ధ్యేయంగా సిలబస్‌లు రూపొందుతున్న తరుణంలో ఇలాంటి సెంటర్ నిర్వహణతో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

**నైపుణ్యం తప్పనిసరి**



విద్యార్థులు నేర్చుకుంటున్న విద్యకు సంబంధించిన నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలి. సాంకేతిక విద్యలో పాలిటెక్నిక్ విద్య కీలకం. విద్యార్థులు చదువుతున్న బ్రాంచ్‌లో అకడమిక్, నైపుణ్య విద్య రెండూ అవసరం. ప్రొడక్షన్ కం ట్రైనింగ్ సెంటర్ విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఇక్కడ విద్యార్థులను నైపుణ్యాలను మెరుగుపరచుకుంటున్నారు. ఆదాయం కూడా వస్తోంది. – బి.రవికుమార్, మెకానికల్ విభాగం హెచ్ఓడీ, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల.

**భవితకు ఉపయోగకరం**



డిప్లమాలో విద్యార్థులు నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వారికి ఉపాధి లభించాలంటే పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ అవసరం. క్లాస్ రూమ్‌లో నేర్చుకున్న దాని కంటే ఎక్కువగా ప్రొడక్షన్ కం ట్రైనింగ్ సెంటర్‌లో విద్యార్థులు నేర్చుకుంటున్నారు. రిలీవ్ అయ్యే నాటికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. – జి.దామోదర రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

## భద్రత చర్యలు కల్పించాలని నిరసన



నిరసన చేస్తున్న రావివలస మెట్‌కోర్ పరిశ్రమ కార్మికులతో చర్చిస్తున్న ఎస్ఐ రామకృష్ణ తదితరులు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస మెట్‌కోర్ ఫెర్రో ఎల్లయిస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి భద్రత లేకపోవడంతో ఏ క్షణంలో ఏం జరుగుతందోనని భయపడుతున్నారని, తక్షణమే పరిశ్రమలో భద్రత చర్యలు పాటించాలని డిమాండ్ చేస్తూ కార్మికులంతా సోమవారం పెద్ద ఎత్తున నిరసన చేశారు. పరిశ్రమ నుంచి కార్మికులంతా పెద్ద ఎత్తున టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి నినాదాలు చేశారు. గతంలో పరిశ్రమలో పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికులకు ఒక్కొక్కరికి సుమారు రూ.10 లక్షల వరకు వేతనాలు బకాయిలు ఉన్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా ఫైర్ సేఫ్టీ, వైద్య సదుపాయాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు రోజు వారీ వేతనాల్లో 50 నుంచి 100 రూపాయల వరకు కోత విధిస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తీసి వేస్తామని బెదిరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డికి విన్నవించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన చేస్తున్న విషయం తెలుసుకుని ఎస్ఐ రామకృష్ణతో పాటు మిగిలిన సిబ్బంది సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని కార్మికులతో చర్చించారు.

## వీడలేక.. వీడుకోలు



ఉపాధ్యాయుడు రాజేంద్రబాబు కాళ్లకు నమస్కరిస్తున్న పాఠశాల విద్యార్థులు

కంచిలి: మండలంలోని చంద్రుపుట్టుగ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా రెండేళ్లపాటు సేవలందించి, ఇటీవల ప్రమోషన్‌పై కవిటి మండలం కొత్త కొజ్జిరియా పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుడు రాజేంద్రబాబుకు గ్రామస్తులు, విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. రాజేంద్రబాబు తన బోధనలతో పిల్లలను బాగా ఆకట్టుకున్నారు. రాత్రి వేళ వరకు అదనపు తరగతులు నిర్వహించేవారు. గ్రామస్తులకు కూడా ఈ టీచరంటే చాలాఇష్టం. ఆయన భార్య మీనాకుమారి కూడా విద్యార్థులను ప్రేమగా చూసుకునేవారు. ఇప్పుడు వీరు వెళ్లిపోతుండడంతో గ్రామస్తులంతా ఘనంగా సత్కరించారు. విద్యార్థినులు నృత్యాలు చేసి, పూలతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గొనప సీతారాం, మండల విద్యాశాఖాధికారి ఎస్. శివరాంప్రసాద్, గ్రామస్తులు సహదేవ్, భీమారావు, ఎస్.ఆర్.పి.లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ‘బీసీ కుల గణన చేపట్టాలి’



జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న పైడి చందు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీలకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు ఇవ్వాలని, బీసీ కుల గణన జరిగితేనే పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 15 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయని, దాన్ని ఇంకా పెంచాలని కోరారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలని ఎన్నిసార్లు కేంద్రాన్ని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో ఏ వర్గానికీ లేని క్రీమీలేయర్ ఒక్క బీసీలపై అమలుచేయడం దారుణమన్నారు. న్యాయమూర్తుల నియామకాల్లో బడుగు, బలహీనవర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. బీసీలకు న్యాయం చేసేందుకు గాను ప్రత్యేకంగా బీసీల రాజకీయ పార్టీ పెడతామన్నారు.

**జిల్లా అధ్యక్షుడిగా చందు**

జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పైడి చంద్రరావు (చందు)ని నియమిస్తూ నియామక పత్రం అందించారు. సమావేశంలో బీసీ సంఘం ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి సుబ్బారావు, కొమ్ము రమణమూర్తి, సనపల అన్నాజీరావు, కోరాడ భాను, తాంద్ర శ్రీనివాసరావు, డీపీ దేవ్ పాల్గొన్నారు.

## సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి, డీఆర్వో ఎం.గణపతిరావు

విజయనగరం అర్బన్: శాసనమండలి ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని, ప్రతి అంశాన్ని పరిశీలించాల్సిన బాధ్యత వారిపై ఉందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్పష్టంచేశారు. పోలింగ్ స్టేషన్లలో ఏపీఓలను, పీఓలకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నియమించిన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సూక్ష్మ పరిశీలకులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నియమావళి, నిబంధనలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశంపైనా సూక్ష్మ పరిశీలకులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సొంత నిర్ణయాలు తీసుకోరాదని హితబోధచేశారు. ఉదయం సాయంత్రం వరకు జరిగే ఎన్నికల సరళి, ఇతర అంశాలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల సంఘానికి కళ్లు, చెవులులాంటి వారని ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ జైన్ అభివర్ణించారు. శిక్షణ శిబిరంలో భాగంగా ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఏదైనా సమస్య తలెత్తితే సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేయాలని సూచించారు. శిబిరంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మలత, ఎన్నికల సెల్ అధికారులు, సిబ్బంది, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల ఫిర్యాదు

గార: వమరవల్లి గురుకుల బాలిక పాఠశాలలో విద్యార్థినులతో పనులు చేయిస్తున్నారని తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పి.సుజాత, సీహెచ్ భారతి, కె.నీలవేణి తదితరులు ఆరోపించారు. ఈ మేరకు రెసిడెన్షియల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. విద్యార్థినులతో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, ట్యాంకులు శుభ్రం చేయించడం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై గతంలో ప్రిన్సిపాల్‌కు తెలియజేసినా పరిస్థితుల్లో మార్పు రాలేదని, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ అరుణ వద్ద ప్రస్తావించగా ఆదివారం జరిగే పచ్చదనం, పరిశుభ్రత వంటి ఫొటోలు, గతంలో తీసిన ఫొటోలతో వివాదం చేస్తున్నారని తెలిపారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నామని స్పష్టం చేశారు.

## క్రైం కార్నర్

**● రోడ్డు ప్రమాదంలో ఈఓ మృతి**



ఈఓ యోగేశ్వరరావు (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టుపురం జంక్షన్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ కార్యనిర్వహణాధికారి రఘుపాత్రుని యోగేశ్వరరావు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యోగేశ్వరరావు ఆదివారం కార్యాలయ పనులకు హాజరై రాత్రి టెక్కలికి బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి, కోటబొమ్మాళి సర్పంచ్ కాల్ల సంజీవరావు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అక్కడే ఆయన చికిత్స పొందుతూ చనిపోయారు. యోగేశ్వరరావుకు తల్లి, భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

**● గుర్తు తెలియని వ్యక్తి..**



కాలువ ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : స్థానిక మండల వీధి సమీపంలోని చినబరాటం వీధి కాలువలో జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో చినబరాటం వీధికి నీరు పారే కాలువలో గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉండటం స్థానికులు గమనించి బయటకు తీయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీంతో ఒకటో పట్టణ పోలీసులకు, మండలవీధి సచివాలయం వీఆర్వో చిట్టి మురళీకృష్ణ సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతుని శరీరంపై కాఫీ కలర్ టీషర్టు, దానిపైన తెలుపు, నీలం రంగు గడులు గల ఫుల్ హ్యాండ్ షర్టు ఉన్నాయి. తెలుపు, నీలం, కాఫీ రంగులో గల లుంగీ కిందన ధరించి ఉన్నారు. మృతుని వయస్సు 50 నుంచి 55 ఏళ్లు ఉండొచ్చని, ఎత్తు 5.5 అడుగులు ఉండవచ్చని, ఆదివారం రాత్రి ఎవరూ లేని సమయాన కాలువలో జారిపడి నీరు తాగేయడంతో మృతి చెంది ఉంటాడని వీఆర్వో తన రిపోర్టు స్టేట్‌మెంట్‌లో రాయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

**● ఇంటి నుంచి బయటకు వచ్చి..**

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని హయాతినగరం సమీపంలో నాగావళి నదీ తీరాన బ్రిడ్జి కింద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం దొరికిన విషయం తెలిసిందే. మృతుడి వివరాలు లభ్యమైనట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. పట్టణంలో ఆరంగివీధిలో నివాసముంటున్న భవన కార్మికుడు కొప్పిసెట్టి సుధ (36) చనిపోయినట్లు గుర్తించారు. సుధకు మద్యం అలవాటు ఉండటంతో తరచూ తన భార్యతో కలహాలు వస్తుండేవి. ఈ క్రమంలో ఈ నెల 25 రాత్రి తొమ్మిది గంటలకు బయటకు వెళ్లి వస్తానని భార్యకు చెప్పిన సుధ బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. అప్పుడు వెళ్లిన వ్యక్తి ఇలా చనిపోయాడని భార్య ఆవేదన వ్యక్తం చేశారు.


**● వంశధారలో మునిగి వృద్ధుడి కన్నుమూత**



అప్పయ్య మృతదేహం

హిరమండలం: వంశధార నదిలో ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు మునిగి చనిపోయిన ఘటన హిరమండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని భగీరథిపురం గ్రామానికి చెందిన పైల అప్పయ్య(80) గ్రామం పక్కనే ఉన్న వంశధార నదికి సోమవారం స్నానం కోసం వెళ్లారు. ప్రమాదవశాత్తు మునిగి గల్లంతైపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు తహసీల్దార్ బి.మురళీమోహన్, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల పాటు వెతికాక అప్పయ్య మృతదేహం దొరికింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ జి.నారాయణ స్వామి తెలిపారు.

**● రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..**



వృద్ధుడి మృతదేహం

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారి గట్లపాడు జంక్షన్‌లో ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఏదో వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని సోమవారం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీకి తరలించారు. మృతుని వివరాల కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సమాచారం తెలిస్తే 6309990861 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని పోలీసులు కోరారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ గణేష్ తెలిపారు.

**● ఆటో.. బైక్ ఢీ**

కొత్తూరు: కొత్తూరు మండలం గూనభద్ర బ్రిడ్జి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు, బైక్ నడుపుతున్న ఒకరికి గాయాలైనట్లు ఎస్ఐ ఎం.గోవింద తెలిపారు. ఆటో డ్రైవర్ కింజరాపు రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పత్తి పంటను ఏరుకొని కూలీలతో కొత్తూరు నుంచి గూనభద్ర వైపు ఆటోలో వెళ్తుండగా.. కారిగూడకు చెందిన సవర డేలాగ్రి బైక్‌తో ఎడమ వైపు నుంచి వచ్చి ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు పాడలి గ్రామానికి చెందిన నివర్తి మోహనరావు, జింకరాపు రమణమ్మ, కింజరాపు పద్మావతిలకు గాయాలయ్యాయి. బైక్ రైడర్ కూడా గాయపడ్డాడు. క్షతగాత్రులకు కొత్తూరు సీహెచ్‌సీలో వైద్యం అందించినట్లు ఎస్ఐ చెప్పారు.


**● రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు**



రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాయడుగారి కేశవరావు

నందిగాం: మండలంలోని దేవుపురం పంచాయతీలోని పాలవలసపేట సమీపంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవుపురం పంచాయతీ కొండతెంబూరుకు చెందిన నాయుడుగారి కేశవరావు(48) సోమవారం తన పొలం చూసేందుకు తన ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి గ్రామానికి రాంగ్‌రూట్‌లో వస్తున్నారు. అదే సమయంలో బెజ్జిపల్లి పంచాయతీ సింగుపురానికి చెందిన నాను జగదీష్(26) టెక్కలి నుంచి పలాస వైపు బైక్‌పై వస్తుండగా.. పాలవలస పేట సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో కేశవరావు, జగదీష్ ఇద్దరూ గా యపడటంతో హైవే వాహనంలో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి కేశవరావును మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేశవరావు కుమారుడు ఉమాపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్‌ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**● చెరుకు లారీ బోల్తా**



చినలంకపేట వద్ద బోల్తా పడిన చెరుకు లారీ

రణస్థలం: మండలంలోని రణస్థలం పంచాయతీ రావాడ సమీపంలోని చిన లంకపేట గ్రామం వద్ద సోమ వారం చెరుకు లారీ బోల్తా పడింది. రణస్థలం నుంచి గుమడాం వైపు వెళ్తున్న లారీ చినలంకపేట వద్ద స్కూల్ బస్సును తప్పించబోయి అదుపు తప్పి పడిపోయింది. ఘటనలో డ్రైవర్‌కు చిన్న, చిన్న గాయాలు తప్ప ఎవరికి ఏమీ కాలేదు.

## నాలుగు పంచాయతీల్లో ఎన్నికల నోటిఫికేషన్

ఎచ్చెర్ల: మండలంలోని నాలుగు పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఈఓపీఆర్డీ ఈశ్వరమ్మ తెలిపారు. అజ్జరాం, డి.మత్స్యలేశం, భగీరథపురం, తమ్మినాయుడుపేట గ్రామాల్లో వార్డు మెంబర్లు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. అజ్జరాంలో 1వ వార్డు, డి.మత్స్యలేంలో 6 వ వార్డు, భగీరథపురంలో 4 వ వార్డు, తమ్మినాయుడుపేటలో 1 వ వార్డుకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఇక్కడ గత వార్డు మెంబర్లు మృతి చెందడం వల్ల మే నెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు.